ఓం శ్రీ సాయిరాం

ఖండఖండాంతర ఖ్యాతి నార్జించిన
మహనీయులను గన్న మాతృభూమి
పాశ్యాత్య వీరుల పారద్రోలించియు
స్వాతంత్ర్యమును గన్న సమరభూమి
పాండిత్యమున చాల ప్రఖ్యాతి గాంచియు
ప్రతిభ చూపించిన భరతభూమి
సంగీతసాహిత్య శాస్త్రీయ విద్యల
ధీశక్తి చూపిన దివ్యభూమి
చిత్రకళలతోడ చిత్రమైయున్నట్టి
భరతభూమియందు ప్రభవమొంది
భరతమాత ధర్మభాగ్యంబు కాపాడ
బాధ్యతంతయు మీదె బాలులార!

పవిత్రాత్మ స్వరూపులైన ఋత్విక్కులారా! ప్రజలారా! బాలులారా!
భరతభూమి చాలా భాగ్యభూమి. ఇది బంగారుభూమి, మహా సాధ్వీమణులను, పండితులను, సంగీత కళాకారులను కన్న పవిత్రభూమి. ఇట్టి భూమియందు జన్మించికూడను భారతీయ సంస్కృతియొక్క ఔన్నత్యమును గ్రహించుకోలేక పోవటం చాలా దురదృష్టం.

ఈ రోజు ప్రొద్దున్న ప్రధానాచార్యులు జరుపుతూ వచ్చిన యజ్ఞ కార్యక్రమములు చాలా చిత్రమైనవి, విచిత్రమైనవి, అత్యంత పవిత్రమైనవి. ఇట్టి పవిత్రమైన కార్యక్రమాలను మానవులు కంటితో చూస్తున్నారేగాని, హృదయముతో అనుభవించటంలేదు. పెద్దలు చెప్పినటువంటి విషయములను మనము చెవులతో విన్నప్పుడు వాటిని హృదయములో చేర్చుకొని అనుభవించాలి.

మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనామ్
మనస్సన్యత్ వచస్యన్యత్ కర్మణ్యన్యత్ దురాత్మనామ్.

ఇక్కడ మీరు విన్న విషయములను, కన్న విషయములను హృదయానికి అందించి తద్వారా దైవత్వాన్ని అనుభవించటానికి ప్రయత్నించాలి. భారతదేశమందు ఇటువంటి పవిత్రమైన సంగీత, సాహిత్య, ఆధ్యాత్మిక కార్యక్రమములను ఎన్నియో చూస్తున్నాము, వింటున్నాము. భారతదేశమందున్న భక్తిశ్రద్ధలు మరి ఏ ఇతర దేశములందుకూడను కానరావు. కనుకనే, అనేక దేశాల్లో, అనేక ప్రాంతాల్లో అల్లకల్లోలములు చెలరేగుతున్నాయి. కాని, భారతీయులు మాత్రం ఎన్ని కష్టములు వచ్చినా, ఎన్ని నష్టములు కలిగినా, ఎన్ని బాధలు సంభవించినా భగవన్నామస్మరణచేత వాటిని అధిగమించి శాంతంగా తమ జీవితాన్ని గడుపుతున్నారు. ఇట్టి పవిత్రత, ప్రశాంతత మరి ఏ ఇతర దేశమునందుకూడను కానరాదు. ఇట్టి పవిత్రమైన దేశమునందు జన్మించటం నిజంగా గొప్ప అదృష్టం.

యజ్ఞయాగాది క్రతువులు భారతదేశమందు తప్ప మరి యెందుకూడను కానరావు. యజ్ఞయాగాదులంటే ఏవో కొన్ని మంత్రములను ఉచ్చరిస్తూ అగ్నిలో సమిధలను ఆహుతి చేయటమని భావిస్తున్నారు. మానవుడు తనను తాను భగవంతునికి అర్పితము గావించుకోటం, భగవంతునికి ప్రీతి కలిగించటం, భగవత్ప్రేమకు పాత్రుడు కావటం... ఇదియే నిజమైన యజ్ఞము. యజ్ఞయాగాదులు కేవలం నీ స్వార్థంకోసం, స్వప్రయోజనంకోసం చేసేవి కావు. పరుల శ్రేయస్సుకోసం, ప్రపంచంకోసం, లోకకల్యాణ నిమిత్తమై ఏర్పడినవే. ఇవి అనాది కాలమునుండి మన భారతదేశములో అభివృద్ధి అవుతూ వస్తున్నవి. త్రేతాయుగమందు కూడను ఎన్నియో యజ్ఞయాగాదులు జరిగినవి. కాని, ఆనాడు రాక్షసులు వాటికి భంగము కలిగిస్తూ వచ్చారు. కారణం? యజ్ఞయాగాదులయొక్క విషయము, వాటి గురించిన సత్యము వారికి తెలియకపోవటమే! ద్వాపరయుగము వచ్చేసరికి కొంతవరకు అర్థము చేసుకోటానికి

ప్రయత్నించారు. ఈనాడు అంరూ చదువుకుంటున్నవారే! కాబట్టి, మీరు యజ్ఞయాగాది క్రతువుల విశిష్టతను సంపూర్ణంగా అర్థం చేసుకోవాలి. యజ్ఞయాగదులను ఆచరించాలి. అనగా, ఏ కార్యము చేసిననూ 'భగవత్ప్రీత్యర్థం చేస్తున్నాను' అనే పవిత్రమైన భావముతో ఆచరించాలి. అడుగడుగున, అణువణువున మనయందు భగవత్ప్రీతి ఆవిర్భవించాలి. మానవుడు పుట్టినది ఎందుకోసం? భగవంతునికి ప్రీతికరమైన కర్మలాచరించి తన జీవితమును ధన్యము చేసుకొనే నిమిత్తమేగాని, కేవలం తిండితీర్థాదులతో కాలమును, కాయమును నిరర్థకం గావించుకొనుటకు కాదు. తన సత్యతత్త్వాన్ని తాను గుర్తించాలి. ఎవరిని చూచినా మనము,'మీరెవరండి?' అని ప్రశ్నిస్తాము. మొట్టమొదట నీవెవరో నీవు గుర్తింటుకుంటే పరులెవరో తెలుసుకోటానికి నీకు వీలవుతుంది. ఈనాటి మానవుడు, 'నేనెవరు?' అనేది గుర్తించటానికి ప్రయత్నించకుండా 'నీవెవరు? నీవెవరు?' అని ఇతరులను ప్రశ్నిస్తూ కాలమును వ్యర్థం చేస్తున్నాడు. భగవంతుడు కాలస్వరూపుడు. కనుకనే, భగవంతుని, 'కాలాయనమః, కాలకాలాయనమః, కాలదర్పదమనాయనమః, కాలనియమితాయనమః, కాలాతీతాయనమః' అని స్తుతిస్తున్నాము. కాబట్టి, ఒక్కక్షణమైనా వ్యర్థం చేయకూడదు. కేవలం శారీరక సౌఖ్యములకోసమని, మానసిక తృప్తికోసమని,ఇంద్రియముల ఆనందము కోసమని మీరు ప్రాకులాడుతున్నారేగాని, ఆత్మతృప్తి నిమిత్తమై ఎవ్వరుకూడను పాటుపడటం లేదు. ఈ ఇంద్రియ సౌఖ్యములెంతవరకు? ఈ దేహముయొక్క ఆనందము ఎంతవరకు? ఇవన్నీ క్షణభంగురములే! అన్నీ కదలిపోయే మేఘములే! హృదయమొక్కటే శాశ్వతమైనది. కాబట్టి, హృదయ తృప్తికోసం మీరు పాటుపడాలి. సత్సంగముచేతనే అది సాధ్యమవుతుంది.

సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః.

చెడ్డవారితో చేరితే నీవు చెడ్డవాడవైపోతావు. Tell me your comany, I shall tell you what you are. నీవు ఎట్టివారితో చేరుదువో నీ గుణములు అట్టివిగానే మారును. కాబట్టి, నీవు పెద్దలతో, విద్యావంతులతో, ఆధ్యాత్మిక చింతనచేయు వారితో కలవాలి. ఈనాడు ఇక్కడ చేరిన సత్సంగము గొప్ప సత్సంగము. ఇటువంటిది మనకు మరొచోట లభ్యము కాదు. ఇటువంటి సత్సంగములో చేరినప్పుడు మనలో పవిత్రమైన భావములే ఆవిర్భవిస్తాయి.

ఎట్టి మంటయో అట్టి పొగ. ఎట్టి పొగయో అట్టి మేఘము. ఎట్టి మేఘమో అట్టి వర్షము. ఈనాడు కురిసే వర్షము సరియైన వర్షము కాకుండాపోతున్నాది. నీరే మనిషికి ప్రాణాధారం. మనిషికి వచ్చే అనేక రోగములకు మూలకారణం కలుషితమైన నీరే. అంతేకాకుండా, చుట్టూ ఉన్న వాతావరణంకూడా దానికి కారణమవుతున్నాది. కాబట్టి, మన పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలి. త్రాగే నీరు పరిశుద్ధంగా ఉండాలి. అప్పుడే మనము ఆరోగ్యాన్ని, ఆనందాన్ని అనుభవించగలము. ఆరోగ్యమునకు ఆనందమే ప్రధానము.

విద్యార్థులారా! ముఖ్యంగా మీ వయస్సులో మీ చుట్టూ ఉన్న వాతావరణము పవిత్రంగా ఉండేటట్లు మీరు చూసుకోవాలి. కనుక, సత్సంగములో చేరండి. మంచి మాటలు, మంచి పాటలు, మంచి ఆటలకు దోహదము రల్పించే స్థానములో మీరు ప్రవేశించాలి. మీరు చేసే పనులు మానవోద్ధరణ గావించేవిగా ఉంటుండాలి. ఎవరితో మాట్లాడినా మీరు శాంతంగా, ప్రేమతో, కరుణతో మాట్లాడాలి. కఠినమైన పదములు ఉపయోగించకూడదు. కఠినోక్తులు హృదయాన్ని గాయపరుస్తాయి. మంచి మాటలచేత, పవిత్రమైన పలుకులచేత మనము ఎదుటి వ్యక్తి హృదయాన్ని కరిగించాలి. 'help ever, hurt never' అందరికీ మనము సహాయంగా ఉంటుండాలి. మంచి మాటలచేత నీవు అందరితో స్నేహంగా మెలగాలి.

మంచివారితో కూడినప్పుడే మన హృదయము పవిత్రంగా మారుతుంది. సత్సంకల్పాలు మనలో ఆవిర్భవించినప్పుడు సత్కర్మలనాచరిస్తాము. సత్కర్మాచరణ వలనే సత్ఫలితాలను మనము అందుకోగల్గుతాము. భగవంతుడు మీకు నాలుక యిచ్చినందులకు మీరు పవిత్రమైన పలుకులు పలికి దానిని సద్వినియోగం గావించుకోవాలి. ఎవరైనా పెద్దలు ఇంటికి వచ్చినప్పుడు 'దయచేయండి, కూర్చోండి' అని ప్రేమతో వారిని

ఆహ్వానించాలి. ఎవరితోనూ కఠినంగా మాట్లాడకూడదు. నీ మంచిచెడ్డలు నీ మాటలపైనే ఆధారపడి ఉంటాయి. నీవు మంచి మాటలు మాట్లాడితే సమాజంలో నీకు మంచి స్థానమే లభిస్తుంది. నీకు జవాబు చెప్పేవారు కూడా మంచిగా జవాబు చెబుతారు.

కనుక, పిల్లలారా! మీరు గొప్ప చదువులు చదువుతున్నామని గర్వించకండి. విద్యార్థి దశలో మీలో గర్వం ప్రవేశించిందంటే అది జీవితాంతం మిమ్మల్ని విడిచిపెట్టదు. మీరు మాట్లాడే మాటలు మంచివైనప్పుడు మీ హృదయంకూడా మంచిదౌతుంది. మీ హృదయం మధురంగా ఉన్నప్పుడు మీలో ఆవిర్భవించే సంకల్పములుకూడా మధురంగానే ఉంటాయి. కనుక, మొట్టమొదట మీరు మీ హృదయాన్ని పవిత్రము గావించుకోండి. మృదుమధురంగా మార్చుకోండి. ఈ పది దినములలో చాలా పవిత్రమైన వ్యక్తులు, గొప్ప పండితులు ఇక్కడ ప్రసంగాలు చేస్తారు. వారు బోధించే పవిత్రమైన మాటలను మీరు హృయంలో ప్రింటు చేసుకోవాలి.

ప్రేమస్వరూపులారా! మీరు సాటి మనిషి పట్ల ప్రేమతో, జాలితో, కరుణతో మీ జీవితాన్ని గడపాలి. మీ జీవితమంతయు ప్రేమమయంగా మారాలి. ప్రేమ చాలా మధురమైనది. దానియందున్న మాధుర్యం మరి దేనియందూ కానరాదు. మొట్టమొదట మీ మాటలను పవిత్రంగా మార్చుకోండి. మీకు మీ విరోధి కనిపించినప్పటికీ ప్రేమతో, 'నమస్కారమండీ' అని చెప్పండి. 'వీడు నా విరోధి కదా' అని అతనిని చూస్తూనే మీరు ముఖము తిప్పుకొని పోకూడదు. అందరితోనూ మనము స్నేహముగా ఉంటుండాలి. అదియే వేదము

సహనా వవతు సహనౌ భునక్తు
సహవీర్యం కరవావహై
తేజస్వినావధీతమస్తు
మావిద్విషావహై.

కలసిమెలసి తిరుగుదాం కలసిమెలసి పెరుగుదాం
కలసిమెలసి కలిమిచెలిమి బలముగుణము పెంచుదాం
కలసిమెలసి తెలుసుకొన్న తెలివిని పోషించుదాం
కలసిమెలసి కలిమితోడ చెలిమిగ జీవించుదాం
శాంతిశాంతి శాంతియని శాంతిపూడ చేయుదాం
ఓంఓంఓం అనుచు ఓంకారము పాడుదాం.

ఇవియే వేదము మొట్టమొదట బోధించినటువంటి సువాక్యములు. నాలుక చాలా మృదువైనది. అట్టి మృదువైన నాలుకనుండి మధురమైన మాటలే రావలిగాని, కఠినమైన మాటలు మాత్రము రాకూడదు. కఠినమైన మాటలతో ఎదుటి వ్యక్తిని బాధిస్తే దాని ఫలితంగా భవిష్యత్తులో మనము చాలా బాధపడవలసి వస్తుంది.

ప్రేమస్వరూపులారా! విద్యార్థులారా! రేపటినుండి పండితులు మీకు అనేక మంచి విషయాలు చెబుతారు. వాటిని మీరు క్రోడీకరించుకొని మీ హృదయములోనికి చేర్చుకోవాలి. కేవలం క్లాసుల్లో టీచర్లు బోధించే పాఠ్యాంశాలకు మాత్రమే మీ చదువు పరిమితం కాకూడదు. అది 'ఆర్టిఫిషియల్' విద్య. మీరు 'హార్టిఫిషియల్' విద్యను నేర్చుకోవాలి. హృదయం చాలా ప్రధానమైనది. ఈ పండితుల ప్రసంగాల వల్ల మీకెంతో జ్ఞానము, పవిత్రత చేకూరుతాయి.

శ్రవం కీర్తనం విష్ణోస్మరణం పాదసేవనం
వందనంఅర్చనం దాస్యంస్నేహమాత్మనివేదనం.

అనే నవవిధ భక్తి మార్గములలో శ్రవణము మొట్టమొదటిది. కాబట్టి, మనము మంచి మాటలను శ్రవణం చేయాలి. ఎవరైనా నీకు అయిష్టమైన పలుకులు పలుకుతుంటే తక్షణమే ఆ స్థానమును వదలిపెట్టు. అవన్నీ గాలిలో కలిసిపోతాయి. చెడ్డ మాటలను నీవు గాలికి వదలాలి. మంచి విషయములను మాత్రమే నీవు స్వీకరించు. మంచి విషయములనగా భగద్విషయములే!అదే సత్యము, నిత్యము, పవిత్రము. అట్టి సత్యనిత్యమైన వాక్కులను మీరందుకొని, మీ జీవితమును ఆదర్శవంతముగా తీర్చిదిద్దుకోండి. భగవంతుడు చెప్పే మాటలు ఎంతో మధురమైనవి. భగవంతుని వాక్యములు అమృత మయమైనవి. మీరు యేమాత్రము వదలిపెట్టకూడదు. దైహమునైననూ వదలవచ్చుగాని, భగవంతుని మాటలను

వదలకూడదు. 'పాంచభౌతికము దుర్బలమైన కాయంబు, ఎప్పుడో విడిచేది ఎరుక లేదు'. దేహమును ఏనాటికైనా మనము వదలిపెట్టవలసిందే! కాబట్టి, దేహమును ప్రధానంగా పెట్టుకోకూడదు. కేవలం ఉదర పోషణకై మనము జీవించ రాదు. మానసిక శాంతి కోసము, ఆత్మానందము నిమిత్తము మనము ఇలాంటి సత్సంగములో చేరాలి. చేరటం మాత్రమే కాదు, పెద్దలు బోధించే మంచి విషయాలను హృదయములో చేర్చుకోవాలి.

(అతిరుద్రమహాయజ్ఞ సందర్భముగా సాయకుల్వంత్‌హాల్‌లో 10.08.2006 సాయంత్రము స్వామివారిచ్చిన ఉపన్యాసము)